క్లుప్తంగా

వచ్చే నెల 1న దుర్గాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న దుర్గాలమ్మ ఆలయం

డెంకాడ: మండలంలోని కొండరాజుపేటలో నూతనంగా నిర్మించిన దుర్గాలమ్మ ఆలయాన్ని ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రారంభించనున్నట్లు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సరగడ బంగారురెడ్డి, ఆయన సతీమణి గ్రామ సర్పంచ్ కల్యాణి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ, తమ సొంత నిధులతో ఆలయాన్ని నిర్మించామని, ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, తదితరులు హాజరవుతారన్నారు.

విద్యార్థిని అదృశ్యం

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ. నరేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. చింతపల్లి బర్రిపేటకు చెందిన విద్యార్థిని ఈ నెల 28న ఉదయం ఎనిమిది గంటల సమయంలో పాఠశాలకు వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరింది. అయితే విద్యార్థిని సాయంత్రం ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు సమీప గ్రామాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్రమత్తంగా ఉండండి

- ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్



గాజులరేగ సమీపంలో కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్

విజయనగరం క్రైమ్: రైల్వే ట్రాక్‌లు దాటే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్ అన్నారు. స్థానిక గాజులరేగ, నెల్లిమర్ల మధ్య రైల్వే ట్రాక్‌ల సమీపంలో ఉన్న ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతేడాది ఇదే ట్రాక్ దాటుతూ ఎనిమిది మంది వరకు మృతి చెందారన్నారు. రైలు వచ్చే పరిస్థితి తెలియకపోవడంతో చాలా మంది చనిపోతున్నారని, అలాగే అధిక సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారన్నారు. ట్రాక్ దాటాలనుకుంటే బ్రిడ్జిలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీలు తాలాడ శ్రీనివాసరావు, లోచన, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ర్యాలీ

డెంకాడ: జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన నెల్లిమర్ల నియోజకవర్గ నాయకురాలు లోకం నాగమాధవి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షత న నిర్వహించనున్న ఈసమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

నేడు భూసర్వేపై గ్రామసభలు

చీపురుపల్లిరూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర భూరీసర్వేపై మండలంలోని మెట్టపల్లి, పి.ఎస్.లక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం రైతులతో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.సురేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ గ్రామ సభలకు ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష హాజరవుతారని పేర్కొన్నారు. భూసర్వేకు సంబంధించిన విధి విధానాలను, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

అమ్మవారికి క్షీరాభిషేకం

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీకనక మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి అర్చకులు ఆదివారం క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఆదివారం అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్నామని అర్చకులు తెలిపారు. పట్టణంతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

చీపురుపల్లి: గవిడివీధికి చెందిన మీసాల అప్పన్న వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు బాపూజీ వృద్ధాశ్రమానికి రూ.5 వేల విరాళం ఇచ్చారు. ఆశ్రమ నిర్వాహకులు కొట్ల లక్ష్మణరావుకు అప్పన్న కుటుంబసభ్యులు జగన్నాథమ్మ, గోవిందరావు, శ్రీనివాసరావు, చిన్నమ్మ కలిసి వార్డు మెంబర్ మజ్జి శంకరరావు చేతులు మీదుగా ఆదివారం నగదు అందజేశారు.

మరింత మెరుగ్గా 'జగనన్న గోరుముద్ద'

- వారంలో 3 రోజుల పాటు విద్యార్థులకు రాగి మాల్ట్
- మార్చి 1 నుంచి అందించాలని ప్రభుత్వం ఆదేశం



జగనన్న గోరుముద్ద తింటున్న విద్యార్థులు (ఫైల్)

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత మెరుగైన పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే జగనన్న గోరుముద్ద ద్వారా పౌష్టికాహారం అందిస్తున్న జగనన్న సర్కారు వారంలో మూడు రోజుల పాటు రాగి మాల్ట్ ఇవ్వాలని నిర్ణయించింది. తద్వారా విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి అవసరమైన కాల్షియం, ఐరన్, తదితర పోషకాలను అందించడానికి అధికారులు సమయాత్తమవుతున్నారు. ఈ మేరకు మార్చి 1వ తేదీ నుంచి వారంలో మూడు రోజుల పాటు బెల్లం కలిపిన రాగి జావ అందించాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేగాకుండా అన్ని పాఠశాలలకు సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే ఇకపై సరఫరా చేస్తారు.

నెల్లిమర్ల నియోజకవర్గంలోని నెల్లిమర్ల నగర పంచాయతీ, నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో మొత్తం 260 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 27 వేల మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. ఆహారం లేక విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజనాన్ని మరింత మెరుగుపర్చింది. వారంలో ఆరు రోజుల పాటు కోడిగుడ్లు, ప్రతిరోజూ ఆకుకూరలు, కాయగూరలు, పప్పు, తదితర పోషకాలు అందించాలనే లక్ష్యంతో భోజనంలో పలు మార్పులు చేసింది. అంతేగాకుండా విద్యార్థులు ఇష్టంగా తినాలనే ఉద్దేశంతో బిర్యానీ, కిచిడి, పులిహోర, పలావు, స్వీట్ పొంగల్, తదితర వంటకాలను విద్యార్థులకు అందిస్తోంది. దీంతో గతంలో మధ్యాహ్న భోజనం తినడానికి ఇష్టపడని విద్యార్థులు సైతం జగనన్న గోరుముద్దను ఇష్టంగా తింటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న జగనన్న గోరుముద్దను మరింత మెరుగ్గా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల్లో కాల్షియం, ఐరన్ లోపాలను నివారించాలనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనంతో పాటు అదనంగా రాగి జావ అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రోజు తప్పించి రోజు వారంలో మూడు రోజుల పాటు ఒక్కో విద్యార్థికి గ్లాస్ రాగిజావ అందించాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీచేసింది. విద్యార్థులు ఇష్టంగా తాగడానికి బెల్లం కలపాలని నిర్వాహకులను ఆదేశించింది. ఈ మేరకు మార్చి 1వ తేదీ నుంచి రాగిజావ అందించనున్నారు. అలాగే జగనన్న గోరుముద్ద నిర్వహణకు సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నియోజకవర్గంలోని 27 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

రాగి జావతో ఆరోగ్యం



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాగి జావ అందించడం ఎంతో ప్రయోజనకరం. రాగి జావ తీసుకోవడం వల్ల పిల్లల్లో కాల్షియం, ఐరన్ లోపం నివారించవచ్చును. అంతేగాకుండా రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. జ్ఞాపకశక్తి పెరిగి, చదువులో మరింత చురుకుగా మారుతారు.

–డాక్టర్ కె. శ్రీనివాసరావు, డిప్యూటీ సివిల్ సర్జన్, నెల్లిమర్ల సీహెచ్‌సీ

ఆర్థిక ప్రయోజనాలను అడ్డుకోవద్దు..

- ఏపీజీఈఏ డిమాండ్



మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు

విజయనగరం అర్బన్: ఉద్యోగికి ఆర్థికంగా రావాల్సిన ప్రయోజనాలను అడ్డుకోవద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక డ్రైవర్ల అసోషియేషన్ భవనంలో జరిగిన వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశంలో పలువురు మాట్లాడుతూ, రెండేళ్లుగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆర్థిక ప్రయోజనాలను కల్పించాలని కోరుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గ తీర్మానం మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.ఆస్కారావు విధిలేని పరిస్థితిలో రాష్ట్ర గవర్నర్ హరిచందన్ విశ్వభూషణ్‌ను కలవాల్సి వచ్చిందని తెలిపారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి కంది వెంకటరమణ, వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు వి.శ్రీనివాసరావు, బియ్యాల చంద్రశేఖర్, మరడ సింహాచలం, పువ్వల శ్రీనివాసరావు, పి.భూషణరావు, ఎల్‌వీ యుగంధర్, సీహెచ్.వెంకట్ సతీష్, వై.శంకరరావు, రామచంద్రపాండా, కె.శంకరరావు, వీవీ సుబ్రహ్మణ్యం, ఎస్.సూర్యనారాయణ, బి.శంకరరావు, ఉమామహేశ్వరరావు, కె.శిరీషారాణి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు రాజ్యాధికారమే లక్ష్యం

- మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్



విశ్వనాథ్‌ను అభినందిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

విజయనగరం ఫోర్ట్: దళిత బహుజనలకు రాజ్యాధికారం అందించడమే మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్‌ద్ అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అణగారిన ప్రజల విముక్తి కోసం ఎంఎస్‌పీ పని చేస్తోందన్నారు. పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్రంలో అధిపత్య కులాలకు వ్యతిరేకంగా పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడిన ఏకైక పార్టీ తమదేనని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో దళిత, బహుజన, ముస్లిం మైనార్టీ ప్రజలందరిని కలుపుకొని ప్రధాన సమస్యలపై పోరాడతామన్నారు. అనంతరం విశ్వనాథ్‌ను సన్మానించారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీనుమాదిగ, అప్పారావు మాదిగ, శంకరరావు మాదిగ, ఈశ్వరావు మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకి ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మజ్జిగౌరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన మజ్జిగౌరమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు పులఖండం శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో మజ్జిగౌరమ్మ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి, తొలిపూజలు గ్రామస్తులతో చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు, సచివాలయాల మండల కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, రాయఘడ, పార్వతీపురం ప్రాంతాల వేదపండితులు రేజేటి శ్రీనివాసశర్మ, వేమకోటి నాగభూషణశర్మ, పులఖండం శ్రీకాంత్ శర్మ, ఆలయ ధర్మకర్తలు వావిలపల్లి నందీశ్వరరావు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో ఇంటింటి కుళాయిలు



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, నాయకులు

గుర్ల: మండల కేంద్రంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.80లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఇంటింట కుళాయిల పనులకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు ఆదివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండలంలో 80 శాతం గ్రామాల్లో ఇంటింట కుళాయిల పనులు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, ఎంపీటీసీ సతివాడ సూర్యకాంతం, ఇజ్జిరోతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణే సఖి గ్రూపుల లక్ష్యం

బొండపల్లి: బాలికల సంరక్షణే లక్ష్యంగా సఖి గ్రూపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఏ.వేదవతి తెలిపారు. మండల కేంద్రం లోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు సఖి గ్రూపుల ఆవశ్యకతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం, రక్తహీనత, ఇతర సమస్యలపై సలహాలు, సహాయం అందించేందుకు ఈ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రూపుల్లో ఉపాధ్యాయినులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది ఉంటారని తెలిపారు. సభ్యులు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకుని కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్...



చేపడుతున్న వ్యర్థాల తొలగింపు పనులు

కొత్తవలస: కొత్తవలస – విజయనగరం రోడ్డులో చింతలదిమ్మ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా డంప్ చేసిన వ్యర్థాల తొలిగింపు ప్రక్రియను అధికారులు ఆదివారం చేపట్టారు. సమీప గ్రామాల నుంచి చెత్తను తీసుకువచ్చి రోడ్డు పక్కన కిలోమీటర్ మేర డంప్ చేశారు. ఈ సమస్యపై 'రోడ్డుపై ప్రమాదకరంగా వ్యర్థాలు' శీర్షికతో సాక్షి పత్రికలో శనివారం వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్థానిక పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి జేసీబీతో వ్యర్థాలను ట్రాక్టర్లకు లోడింగ్ చేయించి దూరంగా తరలించారు. వ్యర్థాలు తొలగించడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం



బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రేగిడి: వైఎస్సార్ బీమా పథకం పేదలకు వరం లాంటిదని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పెద్దశిర్లాం గ్రామానికి చెందిన సంచాన విష్ణుమూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన భార్య అప్పలనారాయణకు వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల తక్షణ సాయం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, సర్పంచ్ లెంక రాంబాబు, రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, మండల సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల అబ్జర్వర్ పాలవలస రామచంద్రినాయుడు పాల్గొన్నారు.

తూర్పు కాపులను బీసీ-ఏ లోకి మార్చాలి

- ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్



ఆత్మీయ సమాశంలో పాల్గొన్న తూర్పుకాపు సంక్షేమ సంఘ నాయికులు

విజయనగరం పూల్‌బాగ్: తూర్పుకాపుల రిజర్వేషన్‌ను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ఏపీ తూర్పుకాపు సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. ఆదివారం స్థానిక తోటపాలెంలోని సింహాద్రి ఫంక్షన్ హాల్‌లో తూర్పుకాపు ఆత్మీయ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా విజయనగరం నియోజకవర్గ పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, వివిధ హోదాల్లో ఉన్న వారిని సత్కరించారుర. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తూర్పుకాపులకు ఉన్న 7 శాతం రిజర్వేషన్‌ను 12 శాతానికి పెంచాలన్నారు. ప్రతి మండలానికి ఒక కల్యాణ మంటపం, సామాజిక భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. తూర్పుకాపుల అభ్యున్నతిని కాంక్షిస్తూ త్వరలో జన జాగృతి యాత్ర చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘ జాతీయ ఆర్గనైజింగ్ కో కన్వీనర్ కద్దాల శ్యామసుందరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాట్రాజు రాజారావు, విజయనగరం మండల అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్ము ఆదినారాయణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిమజ్జి మల్లేశ్వరరావు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు పత్తిగుళ్ల వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జపురపు శ్రీనివాసరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు విసినిగిరి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మగంటి రామ్మోహనరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసుబాబు, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు గంటాడ మోహనరావు, ప్రముఖ వైద్యుడు మురళీమోహన్, గుర్ల నాయకులు లెంక తాతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో 'నారాయణపురం'

- రూ. 2.5 కోట్లతో అభివృద్ధి పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



రూ. 25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

విజయనగరం రూరల్: 'అభివృద్ధి.. సంక్షేమం' రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్నారు. అంతేకాకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు మంజూరు చేయడమే కాకుండా గ్రామాలకు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

రూ. 2.5 కోట్లు మంజూరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలో గ్రామానికి ఇప్పటివరకు అభివృద్ధి పనులకు రూ. 2.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందులో కోటి రూపాయలతో జిల్లా కేంద్రం నుంచి గ్రావెల్ రోడ్డు నిర్మించారు. మరో రూ. కోటితో గ్రామ సచివాలయ భవనం, విలేజ్ క్లినిక్, రైతుభరోసా కేంద్రం, పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతోపాటు గ్రామంలో మరో మూడు చోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతో గ్రామంలో అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా పూర్తి చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణం పూర్తి చేసుకున్న రైతుభరోసా కేంద్రం



నిర్మాణం పూర్తయిన వెల్‌నెస్ కేంద్రం



సుందరంగా తీర్చిదిద్దిన ఎస్‌డబ్ల్యూపీ కేంద్రం

అభివృద్ధి దిశగా నడిపిస్తాం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చారు. అవినీతికి తావులేకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. దీంతోపాటు అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారు. మూడున్నరేళ్లలో గ్రామాభివృద్ధికి రూ. 2 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయడంతో సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం, జల్ జీవన్ మిషన్ పనులు, విలేజ్ క్లినిక్ భవనం, సీసీ రోడ్లు నిర్మించుకున్నాం. అలాగే జిల్లా కేంద్రం నుంచి ఎస్వీఎన్ నగర్ మీదుగా గ్రామానికి రహదారి వేసుకున్నాం. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకున్నాం.

– వై.పైడిరాజు, సర్పంచ్, నారాయణపురం

ఎన్‌సీసీ పరీక్షకు 195 మంది హాజరు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్‌సీసీ(నేషనల్ క్యాడెట్ కార్ప్స్) 'ఎ' సర్టిఫికెట్ పరీక్షకు 195 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ బీవీ అచ్యుత్‌కుమార్ తెలిపారు. రాజాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సన్ స్కూల్, శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలురు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలికలు), కొల్లివలస లోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల, పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి ఎన్‌సీసీ శిక్షణ పొందిన విద్యార్థులు హాజరయ్యారని, అయితే ఇద్దరు గైర్హాజరయ్యా రని పేర్కొన్నారు. వీరందరికీ రాత పరీక్షతో పాటు డ్రిల్ పరీక్ష కూడా నిర్వహించారు. సుబేదార్ ఆర్.నానాజీ, నాయక్ సుబేదార్ భూపేంద్రసింగ్, ఎన్‌సీసీ ఆఫీసర్లు డి.ఉదయ్, కె.హరికృష్ణ, వెంకటరమణల పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి.